క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలపై అవగాహన



కంచరాంలో ప్రభుత్వ పథకాల పోస్టర్లు ప్రదర్శిస్తున్న అధికారులు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో మంగళవారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాసూరీ శంకరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గెడ్డావు సుబ్బమ్మ, ఎంపీటీసీ రాంబాబు, ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు దిలీప్, వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడా పరికరాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ: పట్టణంలో డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు(1991–96 బ్యాచ్) పాఠశాలకు వివిధ క్రీడా పరికరాలను అందజేశారు. పూర్వ విద్యార్థులు గులివిందల షణ్ముఖరావు, గేదెల రవి, తదితరులు మంగళవారం పాఠశాలలో హెచ్ఎం మురళీకృష్ణ, పీఈటీ రేణుక సుజాతను కలిసి వీటిని అందజేశారు. బ్యాడ్మింటన్ బాల్స్, బ్యాట్స్, షటిల్ రాకెట్స్, కాక్స్, వాలీబాల్స్, నెట్, స్కిప్పింగ్ రోప్స్, హ్యాండ్ రింగ్స్, త్రో బాల్స్, స్టేజ్ కర్టెన్స్‌తో పాటు మైక్ సెట్, ఎప్సన్ ప్రింటర్, తదితర వాటిని అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ఆస్పత్రిలోకి చేరిన వాటర్ ట్యాంకులు

రాజాం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని సూపరింటెండెంట్ రాజేశ్వరి అన్నారు. ఆస్పత్రిలో వార్డులు పెరగడంతో పాటు ఇటీవల ఓపీ సేవలు పెరిగాయని, రోగులు, ఆస్పత్రి సిబ్బందికి సరిపడేలా తాగునీరు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొత్తగా 500 లీటర్ల ట్యాంకులను పది వరకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

శానిటేషన్ సెక్రటరీలకు మెమోలు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

బొబ్బిలి: మహారాణిపేట, గొల్లవీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరు బాగులేదని పలుమార్లు సంబంధిత సచివాలయ సెక్రటరీలను హెచ్చరించినా మార్పు రానందున వారికి ఛార్జి మెమోలు జారీ చేయాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని మహారాణిపేట, గొల్లవీధి, పూల్‌భాగ్, రాజా కాలేజీ, తదితర ప్రాంతాల్లో మంగళవారం కమిషనర్ పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై స్థానికుల వద్ద ఆరాతీశారు. ఆయన వెంట మున్సిపల్, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణం



సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని చిన్నయ్యపేటలో సుమారు రూ.10 లక్షలు జీజీఎంపీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం మంగళవారం చేపట్టారు. గడపగడపకు కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించుకునేందుకు జీజీఎంపీ నిధులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సర్పంచ్ ఆర్.రమణమ్మ అన్నారు.

ఉపాధిపనులు ప్రారంభించాలి

రేగిడి: గ్రామాల్లో వేతనదారులు కోరిన వెంటనే ఉపాధి పనులు ప్రారంభించాలని ఏపీఓ హరనాథరావు సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో మంగళవారం ఉపాధి పనుల కల్పనపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే వేతనదారులకు పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం



రాజాం: వాసవీనగర్‌లో పలు సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు చేరువవుతాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని పలు సచివాలయాల పరిధిలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే డిజిటల్ బోర్డులను ఆవిష్కరించారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి, ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని తెలియజేశారు. రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగనే ఎందుకు సీఎంగా కావాలో వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



మెంటాడ: జక్కువ గ్రామంలో సంక్షేమ పథకాల డాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు త్రినాథరావు, తదితరులు



బాడంగి: భీమవరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



రేగిడి: అంబాడలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, కన్వీనర్ జగన్మోహనరావు



సంతకవిటి: చిత్తారిపురంలో సంక్షేమ లబ్ధిని తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ఎం.మోహనరావు, అధికారులు



రాజాం సిటీ: దోసరి రామినాయుడువలసలో డిజిటల్ బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రామభద్రపురం: గొల్లలపేట సచివాలయం వద్ద సంక్షేమ లబ్ధిని తెలియజేసే డాష్‌బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు



వంగర: కొండచాకరాపల్లిలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



బొబ్బిలి: గొల్లపల్లి ఆరో వార్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, నాయకులు

అంచనా, సవరణ బడ్జెట్ల ఆమోదం



బాడంగి: బడ్జెట్ ప్రతిపాదనలు సభ్యులకు చదివి వినిపిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు



బొబ్బిలి: మండల పరిషత్‌లో బడ్జెట్ సమావేశ నిర్వహణ

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన మంగళవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి రూ.23,73,025లతో సవరణ బడ్జెట్‌ను, 2024–25 సంవత్సరానికి గాను రూ. 27,19,000లతో అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించగా.. సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను అధికారుల దృష్టికి తీసుకురాగా.. ఆయా పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాలని ఎంపీపీ లక్ష్మి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోతుల రవికుమార్, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాడంగి: మండల పరిషత్‌కు సంబంధించి 2023–24 ఏడాదికి గాను సవరణ బడ్జెట్, 2024–25 ఏడాదికి గాను ప్రతిపాదించిన అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి గాను రూ.38,52,656లతో అంచనా బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. ఎంపీడీఓ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, కోఆప్షన్ సభ్యుడు ఖాన్, ఏఓ రామలింగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి క్రీడాకారుడికీ రెండు క్రీడల్లో అవకాశం

బొబ్బిలి: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్ల వయసు దాటిన క్రీడాకారుల పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. తన ఛాంబర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, డిసెంబరు 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రతీ క్రీడాకరుడు తనకు ఆసక్తి ఉన్న రెండు క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. డిసెంబరు 15 నుంచి జనవరి 24 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా హిందూధర్మ పరిరక్షణ దినోత్సవం



లక్ష్మణానంద స్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమరసతా ఫౌండేషన్ ప్రతినిధులు, చిన్నారులు

బొబ్బిలి: మండలంలోని రాజచెరువువలసలో మంగళవారం హిందూధర్మ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమరసతా ఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారకులు దూపం వాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడిన లక్ష్మణానంద స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొయ్యి వెంకటరమణ, రాయల పాపారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న పీఓ రాజ్యలక్ష్మి

బాడంగి: బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నాడు-నేడు ఫేజ్-2బి కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలను త్వరితగతిన పూర్తిచేసి అప్పగించాలని ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో నాడు-నేడు పనులపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో మొత్తం 100 భవనాలు మంజూరైనట్లు చెప్పారు. నాడు-నేడు ఫేజ్-2బీ కింద ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, గోడలకు రంగులు, విద్యుత్ వైరింగ్, తదితర పనులు మంజూరయ్యాయన్నారు. ఆయా పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సర్వశిక్ష అభియాన్ ఏఈ కిషోర్‌కుమార్, హెచ్ఎంలు, ఇంజినీరింగ్ సహాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరభద్రుని ప్రభ తిరువీధి



దీపారాధనలో భక్తులు



సంతమార్కెట్‌లో వీరభద్రుని ప్రభ తిరువీధి

రాజాం: పట్టణంలోని మల్లికార్జునకాలనీ, లచ్చయ్యపేట, తాణావీధి, కాలెపువీధి, సంతమార్కెట్ తదితర వార్డుల్లో మంగళవారం వీరభద్రుని ప్రభ తిరువీధి నిర్వహించారు. కార్తీక మాస పూజల్లో భాగంగా చేనేత కార్మికులు వీరభద్రుని ప్రభను రూపొందించి, పూజలు చేశారు. పురవీధుల్లో తిరువీధి అనంతరం మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు, ఆకాశ హారతి అందజేశారు. కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దీపారాధన

రాజాం: పట్టణంలో సంతమార్కెట్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం వద్ద మంగళవారం దీపారాధన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూర్ణకలశం, ఓంకారం, లింగాకారం, హంస, ఆంజనేయస్వామి ఆకృతుల్లో దీపాలు వెలిగించారు.

5లోగా ఓటరు జాబితాలు సిద్ధం చేయాలి

బాడంగి: డిసెంబరు 5లోగా కచ్చితమైన, తప్పులు లేని ఓటర్ల జాబితాలను తయారు చేయాలని తహసీల్దార్ అజురఫీజాన్ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాల తయారీపై సమీక్షించారు. ఎలక్టోరల్ పాపులేషన్ 70–73 శాతం ఉండేలా చూసుకోవాలని, అంతకంటే ఎక్కువ ఉంటే మరణించిన, శాశ్వత వలసపోయిన ఓటర్ల వివరాలు తొలగించాలని, తక్కువ ఉంటే కొత్తవారిని చేర్చుకోవాలని సూచించారు. ఒక పోలింగ్ బూత్‌లో స్త్రీ, పురుష ఓటర్ల నిష్పత్తి సమానంగా ఉండేలా, ఒక కుటుంబంలోని ఓటర్ల వివరాలు ఒకే బూత్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌డీటీ చిన్నంనాయుడు, ఏఎస్‌ఓ నళిని, వీఆర్‌ఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

రేగిడి: మండలంలో మునకలవలస, బాలకవివలస, చిన్నశిర్లాం, ఉప్పర్నాయుడువలస, వన్నలి తదితర గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను పరిష్కరిస్తుండడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మాణం చేస్తున్నారు. ఇందులో భాగంగా బాలకవివలస గ్రామంలో రూ.4 లక్షలతో సుమారు 160 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మించినట్లు పంచాయతీ సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు.

సామాజిక చైతన్యానికి ఆద్యుడు పూలే

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు



రాజాం: జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

బొబ్బిలి: సామాజిక చైతన్యానికి ఆద్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు, స్త్రీ అక్షరాస్యత కోసం పూలే ఎంతగానో కృషిచేశారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, మున్సిపల్ కౌన్సిలర్ బొత్స రమణమ్మ, పార్టీ నాయకులు వాడపల్లి మనోజ్‌కుమార్, దిబ్బగోపి, ముగిది మురళి తదితరులు పాల్గొన్నారు.

పూలే గొప్ప సంఘ సంస్కర్త: ఎమ్మెల్యే జోగులు

రాజాం: అణగారిన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్య కోసం మహాత్మా జ్యోతీరావు పూలే చేసిన కృషి ఆదర్శమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతీరావుపూలే వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. స్త్రీ విద్యను ప్రోత్సహించేందుకు, నాటి సమాజంలోని మూఢ విశ్వాసాలను రూపుమాపేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, దూబ గోపాలం, శాసపు వేణుగోపాలనాయుడు, ఆర్నెపల్లి వెంకటనాయుడు, వాసు, పాలవలస శ్యామ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలపై టీడీపీ నేతల దుష్ప్రచారం



కొట్టక్కిలో వైఎస్సార్‌సీపీ కండువాలతో పార్టీ కార్యకర్తలు, జెడ్పీటీసీ సరస్వతి, తదితరులు



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బొబ్బిలి కోటలో సోమవారం టీడీపీలో చేరినట్లు సోషల్‌మీడియా, ఎల్లో మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. వంగపండు సన్యాసినాయుడు, సామిరెడ్డి తాత, రెడ్డి సీతంనాయుడు, రెడ్డి తాత, సామిరెడ్డి అప్పలనాయుడు, మర్పిన అప్పలనాయుడు, ద్వారపురెడ్డి కూర్మ, తదితరులు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకుంటుండగా.. మంగళవారం వారంతా కొట్టక్కి గ్రామంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ సామిరెడ్డి లక్ష్మి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సినీహీరో పవన్‌కళ్యాణ్ వస్తున్నాడని, చూసేందుకు వెళ్తామని తమను మభ్యపెట్టి బొబ్బిలి కోటకు తీసుకువెళ్లారని, అక్కడ బలవంతంగా టీడీపీ కండువాలు వేసి ఫొటో తీసి తామంతా టీడీపీలో చేరినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని వాపోయారు. తామంతా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని, జగనన్న వెంటే నడుస్తామని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు టీడీపీ కార్యకర్తల చేరిక

మండలంలోని ఎస్.సీతారాంపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు మంగళవారం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీ చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఎంపీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చాపల గురువులు, చాపల లక్ష్మణరావు, చాపల అశోక్, తదితరులు ఉన్నారు. వారంతా మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తామంతా లబ్ధిపొందామని, అందుకే ఆయనకు మద్దతు తెలుపుతూ వైఎస్సార్‌సీపీలో చేరామని అన్నారు.

ఎమ్మెల్యేకు పద్మనాయక వెలమ సంఘం వినతి



ఎమ్మెల్యే శంబంగికి వినతిపత్రం అందిస్తున్న పద్మనాయక వెలమ కులస్తులు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనలో పద్మనాయక వెలమ కులాన్ని గతంలో ఉన్నట్టే జాబితాలో పొందుపరచాలని ఆ సామాజిక వర్గ నాయకులు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును కోరారు. ఈ మేరకు వారంతా మంగళవారం క్యాంపు కార్యాయలంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో తమకు పద్మనాయక పేరుతో కులధ్రువీకరణ పత్రాలు ఇచ్చే వారని, కొన్ని సంవత్సరాలుగా ఓసీ వెలమ అని ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన మా పిల్లలకు ఈబీసీ తదితర ఆప్షన్లు వర్తించడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో మా ప్రతిపాదనను మన్నించి పద్మనాయక వెలమ పేరుతోనే కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేవిధంగా సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అపట్టివరకు తాత్కాలికంగా గతంలో మాదిరిగా ఈబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు టి.రామసుధీర్, ఆర్థిక మండలి రాష్ట్ర మాజీ సభ్యులు తూముల భాస్కరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, 20వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి ఎస్.వాసంతి, చెలికాని కేశవ, పద్మనాయక వెలమ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులు, పీఈటీలు, పీడీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 15 నుంచి 44 రోజుల పాటు ఐదు దశల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు, ఏఓ లోపింటి త్రినాథ్, ఈఓపీఆర్డీ గొబ్బూరు విజయ్‌కుమార్, పీడీలు ఎస్.రాంబాబు, టి.రవి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అదృష్టకుమార్



బొబ్బిలి: మానవ హక్కుల సంఘం క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా కె.అదృష్టకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తాళ్లూరి నుంచి ఉత్తర్వులు అందినట్లు అదృష్టకుమార్ మంగళవారం తెలిపారు. స్థానికంగా క్రిస్టియన్, మైనార్టీలకు మరిన్ని సేవలందించేందుకు తనకు అవకాశం లభించినట్లు భావిస్తున్నానన్నారు. ఇందుకు కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.